ఐపీఎల్ మినీ వేలం

ఆల్‌టైం రికార్డ్ 24.75 కోట్లు

స్టార్క్‌కు కోట్లాభిషేకం • కమిన్స్‌కు 20.50 కోట్లు

ప్రపంచ చాంపియన్ల కోసం ఫ్రాంచైజీల పోటాపోటీ

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)ను ప్రపంచంలోనే అత్యంత ధనిక క్రికెట్ లీగ్ అని ఎందుకు అంటారో మరోసారి నిరూపితమైంది. ఒక్క సీజన్ కోసం మాత్రమే నిర్వహించిన ఐపీఎల్ మినీ వేలంలో.. కంగారూల పంట పండింది. వన్డే ఫార్మాట్‌లో ఆరోసారి జగజ్జేతలుగా నిలిచిన ఆసీస్ ప్లేయర్ల కోసం ఫ్రాంచైజీలు ఎగబడ్డాయి. దీంతో లీగ్ చరిత్రలోని అన్నీ రికార్డులు బద్దలయ్యాయి.

ఆసీస్ ఏస్ పేసర్ మిషెల్ స్టార్క్ కోసం కోల్‌కతా నైట్ రైడర్స్ ఏకంగా రూ.24.75 కోట్లు వెచ్చించింది. ఇది కొన్ని దేశాల్లో నిర్వహిస్తున్న క్రికెట్ లీగ్‌లలో మొత్తం జట్టు విలువ కంటే ఎంతో ఎక్కువ. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ కంగారూ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ కోసం రూ. 20.50 కోట్లు పెట్టింది. భారత ఆటగాళ్లలో హర్షల్ పటేల్ 11.75 కోట్లతో టాప్‌లో నిలువగా.. అన్‌క్యాప్‌డ్ ప్లేయర్ సమీర్ రిజ్వీ కోసం చెన్నై రూ.8.40 కోట్లు ఖర్చు చేసింది. తెలంగాణ కుర్రాడు అవనీశ్‌రావును చెన్నై దక్కించుకుంది. మొత్తంగా తమకు అవసరమైన ఆటగాళ్ల కోసం ఫ్రాంచైజీలు కోట్లకు కోట్లు కుమ్మరించాయి.

స్టార్క్

కమిన్స్

షాక్ అయ్యా

ఇది కలలో కూడా ఊహించలేదు. వేలంలో పలికిన ధర చూసి ఆశ్చర్య పోయా. ఇంత భారీ మొత్తం వెచ్చించినప్పుడు అంచనాల ఒత్తిడి కూడా అధికంగా ఉంటుందనేది వాస్తవం. గతంలో ఐపీఎల్ ఆడిన అనుభవాన్ని ఉపయోగించుకోవాల నుకుంటున్నా. ధరకు న్యాయం చేసేందుకు వీలైనంత కృషిచేస్తా.

- మిషెల్ స్టార్క్

దుబాయ్: ఆస్ట్రేలియా పేసర్ మిషెల్ స్టార్క్ ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర పలికిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఎని మిదేండ్ల క్రితం ఐపీఎల్‌లో ఆడిన స్టార్క్.. తాజాగా ఆస్ట్రేలియా జట్టు వన్డే ప్రపంచకప్ గెలు వడంలో కీలక పాత్ర పోషించి పుల్ జోష్‌లో ఉండ టంతో అతడిని దక్కించుకునేందుకు ఫ్రాంచైజీలు పోటీపడ్డాయి. చివరకు రూ.24.75 కోట్లకు కోల్ కతా నైట్ రైడర్స్ స్టార్క్‌ను దక్కించుకుంది. ఇక ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌ను హైదరాబాద్ జట్టు రూ. 20.50 కోట్లకు కొనుగోలు చేసుకుంది. వీరిద్దరి కోసం పోటీపడిన ఫ్రాంచైజీలు అదే ఆస్ట్రేలియాకు చెందిన మరో పేసర్ హజిల్‌వుడ్‌ను పట్టిం చుకోకపో వడం గమనార్హం. ఇప్పటి వరకు ఇంగ్లండ్ ఆల్‌రౌం డర్ సామ్ కరన్ కోసం పంజాబ్ కింగ్స్ వెచ్చించిన రూ.18.50 కోట్లే లీగ్‌లో అత్యధికం కాగా.. ఈ సారి ఇద్దరు ఆసీస్ ప్లేయర్లు ఆ మార్క్ దాటి కొత్త రికార్డు నెలకొల్పారు. గత కొన్ని సీజన్లుగా సరైన ప్రదర్శన కనబర్చలేక నిరాశ పరుస్తున్న సన్‌రైజర్స్ యాజ మాన్యం ఈ సారి వేలంలో భారీ ఖర్చు పెట్టి కీలక ఆటగాళ్లను చేజిక్కించుకుంది.

పంజాబ్ గూటికి హర్షల్

భారత ఆటగాళ్లలో హర్షల్ పటేల్‌ను రూ.11.75 కోట్లకు పంజాబ్ కింగ్స్ కొనుగోలు చేసుకోగా.. అల్జారీ జోసెఫ్ కోసం బెంగళూరు రూ.11.50 కోట్లు ఖర్చుపెట్టింది. గుజరాత్ టైటా న్స్ స్పెన్సర్ జాన్సన్‌కు రూ. 10 కోట్లు వెచ్చించగా.. శివమ్ మావిని రూ. 6.40 కోట్లు పెట్టి లక్నో సొంతం చేసుకుంది. ఉమేశ్ యాదవ్ రూ. 5.80 కోట్లు (గుజరాత్) ధర పలకగా.. కోట్జీకి ముంబై రూ.5 కోట్లు పెట్టింది. అందరూ అనుకున్నట్లే శార్దూల్ ఠాకూర్‌ను రూ. 4 కోట్లకు చెన్నై సొంతం చేసు కుంది. ఓవరాల్‌గా చూసుకుంటే ఈ సారి బౌలర్ల కోసమే ఫ్రాంచైజీలు ఎగబడ్డాయి. నాణ్యమైన పేసర్లపై ఎంత ఖర్చు పెట్టేందు కైనా జట్లు వెనకాడలేదు. న్యూజిలాండ్ ప్లేయర్ డారిల్ మిషెల్ కోసం చెన్నై రూ. 14 కోట్లు పెట్టడం ఒక్కటే కాస్త ఆశ్చర్యం కాగా.. వన్డే ప్రపంచకప్ ఫైనల్ హీరో ట్రావిస్ హెడ్‌ను హైదరాబాద్ రూ. 6.80 కోట్లకు దక్కించుకుంది. ఉనాద్కట్‌ను రూ.1.60 కోట్లు, వణిందు హసరం గను రూ.1.50 కోట్లకు సన్‌రైజర్స్ కొనుగోలు చేసుకుంది. రూ.50 లక్షలతో వేలంలోకి వచ్చిన న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్రను రూ.1.8 కోట్లకు చెన్నై సొంతం చేసుకుంది. రూ.7.40 కోట్లు పెట్టి రాజ స్థాన్ రాయ్‌మన్ పావెల్ కొను క్కోగా.. ఇంగ్లండ్ ఆటగాడు హ్యారీ బ్రూక్‌ను ఢిల్లీ 4 కోట్లకు కొనుక్కుంది.

అమ్ముడుపోని కీలక ఆటగాళ్లు

స్టీవ్ స్మిత్, జోష్ ఇంగ్లిస్, హజిల్‌వుడ్, కరుణ్ నాయర్, ఫిల్ సాల్ట్, కుషాల్ మెండిస్, ఆదిల్ రషీద్, ఇష్ సోధి, తబ్రేజ్ షంసీ, మనన్ వోహ్రా, ఇషాన్ పొరెల్, ఫిన్ అలెన్, కొలిన్ మున్రో, డసెన్, నీషమ్, ఒడెన్ స్మిత్, చమీర, మ్యాట్ హెన్రీ, కైల్ జెమీసన్, మిల్స్, మిల్నే,

20.50 కోట్లు

అవనీశ్

అవనీశ్‌కు అవకాశం

ఇటీవల అండర్-19 ప్రపంచకప్ జట్టుకు ఎంపికైన తెలంగాణ కుర్రాడు అర వెల్లి అవనీశ్ రావుకు ఐపీఎల్ కాంట్రాక్ట్ దక్కింది. కనీస ధర రూ.20 లక్షలకు అవ నీశ్‌ను చెన్నై సొంతం చేసుకుంది. హైదరా బాద్ కుర్రాడు తనయ్ త్యాగరాజన్‌ను రూ.20 లక్షలకు పంజాబ్ దక్కించుకోగా.. తెలుగు ఆటగాడు కేఎస్ భరత్‌ను కోల్‌కతా రూ.50 లక్షలు పెట్టి కొనుక్కుంది.

ఐపీఎల్ చరిత్రలో టాప్-10 వేలం వీరులు

ప్లేయర్	జట్టు	వెల(కోట్లు)	ఏడాది
స్టార్క్	కోల్‌కతా	24.75	2024
కమిన్స్	హైదరాబాద్	20.50	2024
సామ్ కరన్	పంజాబ్	18.50	2023
గ్రీన్	ముంబై	17.50	2023
స్టోక్స్	చెన్నై	16.25	2023
మోరిస్	రాజస్థాన్	16.25	2021
పూరన్	లక్నో	16.00	2023
యువరాజ్	ఢిల్లీ	16.00	2015
కమిన్స్	కోల్‌కతా	15.50	2020
ఇషాన్	ముంబై	15.25	2022

మిషెల్

14.00 కోట్లు

హర్షల్

11.75 కోట్లు

రిజ్వీ రికార్డు ధర

వేలంలో ఆచితూచి నిర్ణయాలు తీసుకునే చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించని ఒక భారత ఆటగాడి కోసం భారీ ధర చెల్లిం చింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 20 ఏండ్ల సమీర్ రిజ్వీని చెన్నై రూ. 8.40 కోట్లు పెట్టి కొనుగోలు చేసుకుంది. దేశవాళీల్లో భారీ సిక్సర్లతో విజృంభిస్తున్న రిజ్వీ కోసం చెన్నై భారీ ధర పెట్టగా.. కుమార కుషాగ్రను రూ.7.20 కోట్లు వెచ్చించి ఢిల్లీ క్యాపిటల్స్ సొంతం చేసుకుంది.

రిజ్వీ

8.40 కోట్లు

ఈ వేలంలో అత్యధిక ధర పలికిన వీరులు

ప్లేయర్	జట్టు	వెల(కోట్లు)
స్టార్క్	కోల్‌కతా	24.75
కమిన్స్	హైదరాబాద్	20.50
డారిల్‌మిషెల్	చెన్నై	14.00
హర్షల్ పటేల్	పంజాబ్	11.75
అల్జారీ జోసెఫ్	బెంగళూరు	11.50

అక్షిత్ అదుర్స్

- జాతీయ వాలీబాల్ టోర్నీకి కరీంనగర్ కుర్రాడు
- తండ్రికి తగ్గ తనయుడిగా గుర్తింపు

గన్నేరువరం, డిసెంబర్ 19: జాతీయ స్థాయి అండర్-14 వాలీబాల్ టోర్నీకి కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్‌కు చెందిన హన్మాండ్ల అక్షిత్ ఎంపికయ్యాడు. భువనేశ్వర్(ఒడిశా) వేదికగా ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు జరిగే జాతీయ టోర్నీలో అక్షిత్ బరిలోకి దిగను న్నాడు. ఇటీవల నారాయణపేట జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అక్షిత్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఈ టోర్నీలో సత్తాచాటడం ద్వారా ఎంపికైనట్లు జిల్లా వాలీ బాల్ కోచ్ రాజ్‌కుమార్ పేర్కొన్నారు.

తండ్రికి తగ్గ తనయుడిగా:

అక్షిత్..తన తండ్రి భాస్కర్ బాటలో పయని స్తున్నాడు. భాస్కర్..ప్రభుత్వ ఉపాధ్యాయుడే కాకుండా రాష్ట్ర స్థాయి వాలీబాల్ ప్లేయర్ కావడం విశేషం. చిన్ననాటి నుంచి తండ్రి చూస్తూ పెరిగిన అక్షిత్..వాలీబాల్‌పై మక్కువ పెంచుకున్నాడు. పీఈటీ రాజ్‌కుమార్ దగ్గర శిక్షణ తీసుకున్న అక్షిత్ పలు వాలీబాల్ టోర్నీల్లో పోటీపడ్డాడు. జాతీయ స్థాయిలో ఆడాలనుకున్న తన కలను కొడుకు అక్షిత్ ద్వారా నెరవేర్చుకోవాలనుకున్న భాస్కర్.. తర్ఫీదు విషయంలో జాగ్రత్త తీసుకునేవాడు. రాష్ట్రంలో ఎక్కడ టోర్నీ జరిగినా..అక్షిత్‌ను పంపేవాడు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదు వుతున్న అక్షిత్ జాతీయస్థాయికి ఎంపిక కావ డంతో తల్లిదండ్రులు భాస్కర్, లావణ్య ఆనం దానికి అవధులు లేకుండా పోయాయి. అక్షిత్ ఎంపికపై వర్దేల్లి వెంకటేశ్వర్లు, పీఈటీలు శ్రీను, రాజ్‌కుమార్, లక్ష్మణ్, శ్రీపాల్‌రెడ్డి, భాస్కర్, నాగరాజు హర్షం వ్యక్తం చేశారు.

సిరీస్ సమం

రెండో వన్డేలో భారత్ ఓటమి

8 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా గెలుపు

జోర్జి (119*)

పోర్ట్ ఎలిజబెత్: బౌలర్లు దుమ్మురేపడంతో తొలి వన్డేలో ఘన విజయం సాధించిన భారత్.. రెండో వన్డేలో అదే జోరు కొనసాగిం చలేకపోయింది. మంగళవారం జరిగిన పోరులో టీమ్‌ఇండియా 8 వికెట్ల తేడాతో దక్షి ణాఫ్రికా చేతిలో ఓడింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ 46.2 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ సాయి సుదర్శన్ (62; 7 ఫోర్లు, ఒక సిక్సర్) మరో హాఫ్‌సెంచరీ సాధిం చగా.. కెప్టెన్ కేఎల్ రాహుల్ (56; 7 ఫోర్లు) ఫిఫ్టీ కొట్టాడు. రుతురాజ్ గైక్వాడ్ (4), తిలక్ వర్మ (10), సంజూ శాంసన్ (12), రింకూ సింగ్ (17), అక్షర్ పటేల్ (7) విఫలమ య్యారు. సఫారీ బౌలర్లలో బర్గర్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేద నలో సఫారీ జట్టు 42.3 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసింది. జోర్జి (119 నాటౌట్; 9 ఫోర్లు, 6 సిక్సర్లు) సూపర్ సెంచరీతో చెలరేగగా.. హెన్రిక్స్ (52), డసెన్ (36) రాణించారు. భారత బౌలర్లలో అర్ష్ దీప్, రింకూసింగ్ చెరో వికెట్ పడగొట్టారు. ఇరు జట్ల మధ్య గురువారం నిర్ణయాత్మక మూడో వన్డే జరగనుంది.

బెంగళూరు వేదికగా ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు జరిగే 38వ జాతీయ ఐటీఎఫ్ తైక్వాండో చాంపియన్‌షిప్‌నకు సిద్ధమవుతున్న తెలంగాణ జట్టు. 25 మందితో కూడిన టీమ్ వివిధ విభాగాల్లో బరిలోకి దిగుతున్నది.

భారత్ హ్యాట్రిక్ పరాజయం

వెలెన్సియా: ఐదు దేశాల హాకీ టోర్నీలో భారత పురుషుల జట్టు పేలవ ప్రదర్శన కొనసాగుతు న్నది. ఇప్పటికే స్పెయిన్, బెల్జియం చేతిలో పరాజయం పాలైన భారత్.. మంగళవారం జరిగిన పోరులో 2-3తో జర్మనీ చేతిలో ఓడింది. భారత్ తరపున అభిషేక్ (9వ నిమిషంలో), శంషేర్ సింగ్ (14వ ని.లో) చెరో గోల్ చేయగా.. జర్మనీకి మాల్టె (28వ ని.లో), క్రిస్టోఫర్ (50వ ని.లో), గాంజలో పైలట్ (51వ ని.లో) గోల్స్ అందించారు. తొలి క్వార్టర్‌లోనే రెండు గోల్స్ కొట్టి పూర్తి ఆధిపత్యం కనబర్చిన టీమ్‌ఇండియా చివరి వరకు అదే జోరు కొనసాగించలేకపోయింది. మరో పదినిమిషాల్లో ఆట ముగుస్తుందనగా వరుసగా రెండు గోల్స్ కొట్టిన జర్మనీ విజయం సొంతం చేసుకుంది. బుధవారం జరుగనున్న పోరులో ఫ్రాన్స్‌తో భారత్ తలపడనుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.